సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21 వేలు పలికాయి. మార్కెట్‌కు 31 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.6 ప్రకారం ధర పలికింది.



జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 6 - 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు కొత్తచెరువులో 'జగనన్నకు చెబుదాం'

కొత్తచెరువు: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ అరుణ్ బాబు అధ్యక్షతన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి తెలిపారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు



గుంతకల్లు: విజయవాడ డివిజన్‌లోని విజయవాడ - గూడూరు సెక్షన్‌లోని బాపట్ల వద్ద జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా ఈ మార్గం గుండా నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారిమళ్లించారు. మచిలీపట్నం - ధర్మవరం (07095) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 25, 27వ తేదీల్లోనూ, అక్టోబర్ 01, 02, 04, 06, 08, 09వ తేదీల్లో పూర్తిగా రద్దు చేశారు. అలాగే ధర్మవరం - మచిలీపట్నం (07096) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 26, 28, 30 తేదీల్లోనూ అక్టోబర్ 02, 03, 05, 07, 09, 10 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయంలో నీరు

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం 1,700 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో గురువారం నాటికి 6,065 క్యూసెక్కులకు పెరిగింది. ఎగువన ఉన్న తుంగా ప్రాజెక్టుకు వరద వస్తుండటంతో అక్కడి అధికారులు దిగువన ఉన్న టీబీ డ్యాంకు నీటిని వదులుతున్నారు. దీంతో మూడు రోజులుగా ప్రవాహం పెరుగుతూ వస్తోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా గురువారం ఉదయానికి 1,620.43 అడుగుల వరకు నీరు నిల్వ ఉంది. 105.788 టీఎంసీల పూర్తి స్థాయి మట్టానికిగాను 62.544 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాంకు ఇన్‌ఫ్లో 6,065 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో 9,964 క్యూసెక్కులుగా ఉంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,680 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నీటి నిల్వతో 20,903 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 20,289 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది.

హత్య కేసులో 9 మంది అరెస్టు



మాట్లాడుతున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో వినాయక పండుగ సందర్భంగా ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో అనంతయ్య (50) మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం 9 మందిని అరెస్టు చేశారు. మొత్తం 18 మందిని నిందితులుగా గుర్తించినట్లు సీఐ యతీంద్ర తెలిపారు. వారిలో 9 మందిని అరెస్ట్ చేయగా, ఇద్దరు బాలలని వెల్లడించారు. అందరినీ దొరిగిల్లు సమీపంలో అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌రెడ్డి

సాక్షి, పుట్టపర్తి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అధిష్టానం అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం న్యాయ విభాగ అధ్యక్షులను ఎంపిక చేసింది. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వి.ప్రసాద్‌రెడ్డికి అవకాశం కల్పించింది. జోనల్ న్యాయ విభాగ అధ్యక్షుడిగా లోకేశ్వర్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అప్పజెప్పిన బాధ్యతకు న్యాయం చేస్తానన్నారు. ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

వందేభారత్.. వచ్చేసిందోచ్



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో నిలిచిన రైలు

హిందూపురం అర్బన్/ధర్మవరం: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ రైలు రానే వచ్చింది. గురువారం అనంతపురం, ధర్మవరం, హిందూపురం మీదుగా దూసుకెళ్లింది. స్థానికులు, ప్రయాణికులు ట్రెయిన్‌ను చూసి మురిసిపోయారు. ధర్మవరంలో స్టేషన్ మాస్టర్ నరసింహ నాయుడు, ఐపీఎఫ్ అధికారి కుమార్, అసిస్టెంట్ ఆపరేషన్ మేనేజర్ పూర్ణచంద్రరావు, జీఆర్‌పీ పోలీసులు ఘన స్వాగతం పలికారు. రైలు ప్రాధాన్యత, సౌకర్యాలు, ఉపయోగాలను వివరించారు. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నామని, ఈ నెల 24 నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు సాగించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు రైలు వద్ద సెల్ఫీలు దిగి ఆనందం వ్యక్తం చేశారు. హిందూపురంలో 'వందేభారత్'ను నిలపకపోవడంపై పలువురు నిరుత్సాహానికి గురయ్యారు. పట్టణ స్టేషన్‌లో ఆపేలా చర్యలు తీసుకోవాలని స్టేషన్ మేనేజర్ రామచంద్రకు విన్నవించారు.



అనంతపురం రైల్వేస్టేషన్‌లో 'వందేభారత్' ఫొటో తీసుకుంటున్న ప్రయాణికులు, స్థానికులు

పరిహారం.. దరహాసం

- 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'తో అన్నదాతకు ధీమా
- నాలుగేళ్లలో రూ.1,855 కోట్ల మేర పరిహారం అందజేత
- తాజాగా ఈ ఏడాది అమలుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్
- అనంతలో 11 పంటలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 9 పంటలకు వర్తింపు
- రెండు జిల్లాల్లో కంది పంటకు గ్రామం యూనిట్‌గా అమలు
- తొలిసారిగా జాబితాలో 'ఆముదం'



అనంతపురం అగ్రికల్చర్: ప్రీమియం రూపంలో రైతులపై ఏ మాత్రం భారం పడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నాలుగేళ్లుగా ఉచితంగా పంటల బీమా పథకం అమలు చేస్తోంది. పెద్ద ఎత్తున పరిహారం కూడా అందిస్తూ రైతులకు ఊరటనిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఐదో ఏడాది వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద వాతావరణ బీమా, ఫసల్ బీమా అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అనంతపురం జిల్లాలో 11 పంటలకు, శ్రీ సత్యసాయి జిల్లాలో 9 పంటలకు ఉచిత పంటల బీమా పథకాలు వర్తింపజేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ-క్రాప్, ఈ-కేవైసీ, సోషల్ ఆడిట్ ద్వారా అత్యంత పారదర్శకంగా ప్రతి రైతుకూ ప్రయోజనం కల్పిస్తున్నారు.

బీమా అమలు ఇలా..

వాతావరణ బీమా కింద గుర్తించిన పంటలకు వర్షపాతం, గాలిలో తేమశాతం, ఉష్ణోగ్రతలు తదితర వాతావరణ పరిస్థితులకు సంబంధించి ఆన్‌లైన్ డేటా ప్రకారం నిబంధనల మేరకు పరిహారం లెక్కకట్టనున్నారు. ఫసల్‌బీమా కింద గుర్తించిన పంటలకు ప్రణాళిక శాఖ అందించే పంట కోత ప్రయోగాలు, వాటి ఫలితాలకు సంబంధించి దిగుబడులను పరిగణనలోకి తీసుకుని పరిహారం అందించనున్నారు. ఇది కూడా గత ఏడేళ్లలో అత్యధిక దిగుబడులు వచ్చిన ఐదేళ్ల దిగుబడులను, ఈ ఏడాది వాస్తవంగా వచ్చిన పంట దిగుబడులతో సరిపోల్చి పరిహారం వర్తింపజేస్తున్నారు.

- అనంతపురం జిల్లాకు సంబంధించి వాతావరణ బీమాను వేరుశనగ, పత్తితో పాటు చీనీ, దానిమ్మ, టమాట పంటలకు వర్తింపజేశారు. ఈ బీమాకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుంటారు. ఫసల్ బీమా కింద గ్రామం యూనిట్ (విలేజ్ ఇన్సూరెన్స్ యూనిట్)గా కందికి బీమా ఇవ్వగా, మండలం యూనిట్‌గా వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప, ఆముదం పంటకు వర్తింపజేశారు. తొలిసారిగా ఆముదం పంటను నోటిఫై చేయడం విశేషం. వాతావరణ బీమాను రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలను 9 క్లస్టర్లుగానూ, ఫసల్‌బీమాను ఆరు క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్-3 కింద వాతావరణ బీమాకు అనంతపురం జిల్లాను మాత్రమే ఎంపిక చేసి బీమా అమలు చేసే బాధ్యతను ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఇచ్చారు.
- శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి వాతావరణ బీమా కింద వేరుశనగతో పాటు చీనీ, దానిమ్మ, టమాటకు వర్తింపజేశారు. ఇక ఫసల్‌బీమా కింద రైతులకు ఉపయోగపడేలా గ్రామస్థాయి యూనిట్ కింద కంది పంటకు ఇచ్చారు. మండలం యూనిట్‌గా వరి, మొక్కజొన్న, జిల్లా యూనిట్ కింద రాగి, ఆముదం పంటలకు బీమా వర్తింపజేశారు. ఇక్కడ కూడా ఆముదం పంటకు తొలిసారిగా ఉచిత బీమా పథకం వర్తింపజేశారు. వాతావరణ బీమాను శ్రీ సత్యసాయి జిల్లాతో పాటు మరో ఆరు జిల్లాలను క్లస్టర్-2 కింద గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీకి అమలు చేసే బాధ్యతను అప్పగించింది. అలాగే ఫసల్‌బీమాను నెల్లూరుతో పాటు శ్రీసత్యసాయి జిల్లాను గుర్తించి హెచ్‌డీఎఫ్‌సీ ఈఆర్‌జీఓ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించారు. మొత్తంగా జిల్లా పరిధిలో 9 పంటలకు ఉచిత బీమా పథకాలు వర్తింపజేశారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పంటల బీమా ఇలా:

సంవత్సరం	లబ్ధి పొందిన రైతులు	వచ్చిన పరిహారం (రూ.కోట్లలో)
2019-20	2,46,649	266.42
2020-21	2,05,291	362.25
2021-22	4,04,461	855.55
2022-23	2,65,114	370.58

నాలుగేళ్లలో రూ.1,855 కోట్లు..

గత నాలుగేళ్లలో ఉచిత పంటల బీమా కింద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్నదాతకు పెద్ద ఎత్తున పరిహారం అందించి ధీమానిచ్చింది. ఉమ్మడి జిల్లా పరిధిలో పైసా ప్రీమియం వసూలు చేయకుండా 11.21 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లోకి రూ.1,855 కోట్ల వరకు పరిహారం జమ చేసింది. ఈ సారి కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, పంట దిగుబడులు అనుకున్నంత స్థాయిలో వచ్చే పరిస్థితి లేనందున నిబంధనల మేరకు అటు వాతావరణ బీమా ఇటు ఫసల్‌బీమా కింద రైతులకు మెరుగైన పరిహారం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి: 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి వైద్యసిబ్బందికి సూచించారు. బుక్కపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లోచర్ల, బండ్లపల్లి, కొడపగానిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఎస్‌ఎంలు, ఎంఎల్‌ఎచ్‌పీలు, ఆశాలు ప్రతి ఇంటినీ సందర్శిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరిస్తున్నామన్నారు. రోగులకు హెల్త్ టోకెన్లు ఇచ్చి ప్రత్యేక వైద్య శిబిరానికి హాజరయ్యేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుబ్రమణ్యం, రుక్సానా, సంధ్య, శకుంతల,రమాదేవి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

నల్లమాడ: సహకార సంఘాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర బృందం సభ్యులు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డీటీ ఏరియా కార్యాలయంలో గురువారం నల్లమాడ సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి అధ్యక్షతన సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర బృందం సభ్యులు హాజరై సూచనలిచ్చారు. కేవలం పరపతి కల్పించడమే కాకుండా పరపతేతర వ్యాపారాలు కూడా చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు.సహకార సంఘాల ఆధ్వర్యంలో గిడ్డంగులు, పెట్రోలు బంక్‌లు, గ్యాస్ ఏజెన్సీలు, జన ఔషధి కేంద్రాల నిర్వహణకు అవకాశం కల్పించారన్నారు. సహకార సంఘాలకు రాబడి ఉంటేనే రైతులకు పరపతి చేకూర్చగలవన్నారు. సదస్సులో ఉపన్యాసకులుగా డాక్టర్ ఎస్‌ఎల్‌ఎన్‌టీ శ్రీనివాసులు వ్యవహరించారు. మినిస్ట్రీ ఆఫ్ కో ఆపరేషన్ కేంద్ర బృందం సభ్యులు, సహకార సంఘం డైరెక్టర్లు గోపాల్‌నాయుడు, సీతారాం, సబ్ డివిజినల్ సహకార అధికారి ఎస్. ప్రభాకర్ నాయక్, బ్యాంక్ మేనేజర్లు గోపాల్, బ్రహ్మాచారి, సీఈఓ కేశవులు, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో సాగాలి

- డీఈఓ మీనాక్షి

ప్రశాంతి నిలయం: విభిన్న ప్రతిభావంత విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని డీఈఓ మీనాక్షి పిలుపునిచ్చారు. గురువారం కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించిన అనంతరం డీఈఓ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంత విద్యార్థుల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటోందన్నారు. సకలాంగులకు ఏమాత్రం తీసిపోకుండా ఎంచుకున్న రంగంలో ప్రతిభ కనబరచాలన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరుగు పందెం, సాఫ్ట్ బాల్, స్లో వాక్, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. మొదటి, రెండు, మూడో స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ మీనాక్షి

వీరిని త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా సహిత విద్యాశాఖ సమన్వయకర్త ఆనంద్ బాబు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ అంజయ్య, పీడీలు వెంకటేష్, రామకృష్ణ, మురార్జీ, నాగరాజు, ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులు, ఐఈఆర్‌ఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

విషాదం నింపిన వినోదం

- డ్యాన్స్ చేస్తూ కుప్పకూలి యువకుడి మృత్యువాత

ధర్మవరం అర్బన్: ఎంతో ఉత్సాహంగా నృత్యం చేస్తూ అందరినీ సంతోషపరుస్తున్న ఓ యువకుడిని మృత్యువు కబళించింది. వినాయక చవితి వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న అతడు.. ఉన్నట్టుండి కిందపడిపోవడం, ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. అంత వరకూ ఎంతో ఆనందంగా ఉన్న స్థానికులు ఈ హఠాత్పరిణామంతో దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఈ సంఘటన బుధవారం రాత్రి ధర్మవరం పట్టణంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన లక్ష్మీదేవి, నాగప్పల కుమారుడు ప్రసాద్ (25) తమ ఇంటి ముందు ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద బుధవారం రాత్రి డ్యాన్స్ చేస్తూ ఉన్నట్టుండి కింద పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.



ప్రసాద్ (ఫైల్)

భార్య గర్భిణి..

మృతుడు ప్రసాద్ టైల్స్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు భార్య మనీషా, కూతురు సహస్ర ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి. ఇలాంటి సమయంలో ప్రసాద్ మృతితో కుటుంబీకులు , బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రసాద్ డ్యాన్స్ చేస్తున్న సమయంలో మిత్రులు తీసిన వీడియో వైరల్ అయ్యింది. అదే వీడియోలో ప్రసాద్ కిందపడిపోవడం కూడా కనిపించింది.

రీ సర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష' కార్యక్రమం కింద చేపడుతున్న రీ సర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి భూ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. వీసీ అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, ఏడీ (సర్వే ల్యాండ్ రికార్డ్స్) రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిద్దాం

- ఎస్పీ మాధవ రెడ్డి పిలుపు

హిందూపురం అర్బన్: ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎస్పీ మాధవ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణ పెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం జరగనున్న నిమజ్జనోత్సవానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహాలను ఉదయం 10 గంటలకల్లా రోడ్లపైకి తీసుకొచ్చేలా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. గుడ్డం కోనేరులో నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ చెప్పారు. విగ్రహాలు తరలించే సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జనం రోజున తమ సహకారం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని,



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వైటీపీ శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్మన్ విద్యాసాగర్, రాయల్‌గోపాల్, జామియా మసీదు ముతవల్లి నూరుల్లా తెలిపారు. కోనేరు వద్ద క్రేన్ సాయంతో విగ్రహాలను నీటిలోకి వదులుతామని అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కంజాక్షన్, తహసీల్దార్ హసీనా ఉన్నీసా తదితరులున్నారు.

కోనేరు వద్ద గట్టి బందోబస్తు

హిందూపురం: వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని పట్టణ సమీపంలోని గుడ్డం కోనేరు వద్ద పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు.కమిషనర్ ప్రమోద్ కుమార్, డీఎస్పీ కంజాక్షన్‌తో కలిసి గురువారం కోనేరు పరిసరాలను ఆయన పరిశీలించారు. గుడ్డం చుట్టూ పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. లైటింగ్ సదుపాయం ఉండేలా చూడాలన్నారు. గజ ఈతగాళ్లతో పాటు మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విగ్రహాన్ని ఇద్దరు క్రెయిన్ వద్దకు తెస్తే, అక్కడి సిబ్బంది కోనేరులో వదులుతారన్నారు. నిర్వాహకులు ముందుగానే అలంకరణ వస్తువులు తొలగించాలని ఆయన సూచించారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

- భారత అంధుల మహిళా క్రికెటర్ దీపిక



సమావేశంలో మాట్లాడుతున్న క్రికెటర్ దీపిక

అమరాపురం: చదువు, క్రీడలకు వైకల్యం అడ్డుకాదని భారత అంధుల మహిళా క్రికెటర్ దీపిక అన్నారు. గత నెల ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచ అంధుల మహిళా క్రికెట్ టీ–20లో భారతదేశ జట్టులో ప్రాతినిథ్యం వహించిన దీపిక... ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ దేశాలపై జరిగిన మ్యాచ్‌ల్లో అత్యధిక పరుగులు, వికెట్లు సాధించిన విషయం తెలిసిందే. దీంతో గురువారం హేమావతిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, ఎంపీపీ ఈరన్న సమక్షంలో గ్రామస్తులు ఘనంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. దీపికతో పాటు ఆమె తండ్రి చిక్క తిమ్మప్పను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఒక కన్ను లేదని ఇంట్లోనే ఉండి ఉంటే ఈ స్థాయికి వచ్చేదాన్ని కాదన్నారు. పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవడం చాలా సులువన్నారు. క్రమశిక్షణ, తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. అనంతరం హెచ్‌ఎం.విజయలక్ష్మి, ఎంపీపీ ఈరన్న తదితరులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దీపికను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, కంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గగన, ఎంపీటీసీ సభ్యుడు జయరామ్, సర్పంచ్ తిప్పేస్వామి, గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవ'సాయానికి పెద్దపీట'

- లక్ష్యానికి మించి బ్యాంకు రుణాలు
- 2022–23లో రూ.10,985 కోట్లు
- 2023–24 లక్ష్యం రూ.10,808 కోట్లు



విస్తారంగా సాగు చేసిన పంటలు

పుట్టపర్తి అర్బన్: ఎద్దేడ్చిన ఎవుసం (సేద్యం).. రైతేడ్చిన రాజ్యం నిలవదని చరిత్ర రుజువు చేసింది. టీడీపీ హయాంలో వ్యవసాయం దండుగ అంటూ అప్పటి సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడమే కాక, ఆ దిశగా పంటల సాగును పూర్తి నిర్వీర్యం చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం రైతు సంక్షేమ రాజ్యం వెలిసింది. రైతు బాగుంటే దేశం బాగుంటుందని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకర్లు సైతం విస్తారంగా రుణాలు అందజేస్తున్నారు. దీనికి తోడు ప్రకృతి కూడా కరుణించడంతో జిల్లా వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేనంత విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి.

గతం కంటే మిన్నగా రుణాల మంజూరు..

గత ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యం రూ.8,133.71 కోట్లు నిర్దేశించుకోగా ఏకంగా రూ.10,985.97 కోట్ల రుణాలను బ్యాంకర్లు అందజేశారు. ఇందులో వ్యవసాయానికి అత్యధికంగా రూ.4994.01 కోట్ల లక్ష్యం కాగా, రూ.7353.92 కోట్లు మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7556 కోట్ల రుణ వితరణను లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇందులో ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలైన ఎంఎస్‌ఎంఈ, విద్య, హౌసింగ్, సోషల్ ఇన్‌ఫ్రా, రినవబుల్ ఎనర్జీ తదితరాలకు రూ.1,937.46 కోట్ల లక్ష్యం కాగా రూ.1,594.61 కోట్లు మంజూరు చేశారు. ప్రాధాన్యత లేని రంగాలకు రూ.1202.24 కోట్ల రుణ వితరణను లక్ష్యంగా నిర్దేశించుకోగా, రూ.2,037.44 కోట్ల రుణాలను మంజూరు చేశారు.

విస్తృత ఉపాధి అవకాశాలు..

బ్యాంకులు విరివిగా రుణాలు అందజేయడంతో జిల్లాలోని రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులకు ఎంతో మేలు చేకూరుతోంది. స్వయం శక్తితో ఎదగడానికి ఇవి దోహదపడుతున్నాయి. పంటల సాగుకే గాక చిరు వ్యాపారాలు, పాడి అభివృద్ధి, డెయిరీల ఏర్పాటు, పౌల్ట్రీ రంగాల అభివృద్ధిని బ్యాంకర్లు ప్రోత్సహిస్తున్నారు. సీసీఆర్సీ కార్డులు పొందిన రైతులకు, జాయింట్ లైబులిటీ గ్రూపులు, కిసాన్ క్రెడిట్ కార్డులు, పీఎం ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్, ముద్ర యోజనా రుణాలతో విస్తారంగా రుణాలను అందజేస్తున్నారు. వ్యవసాయం తర్వాత చిన్న, మధ్య తరహా కుటీర పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. రుణాల రికవరీలోనూ లబ్ధిదారులు బ్యాంకర్లను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రతి నెలా కంతులు సక్రమంగా చెల్లిస్తుండడంతో మరి కొందరికి అవకాశాలు దక్కుతున్నాయి.

2022–23లో రుణాలు ఇలా...			
రంగాలు	లక్ష్యం	మంజూరు	ఈ ఏడాది లక్ష్యం
వ్యవసాయం	రూ.4994.01 కోట్లు	రూ.7353.92 కోట్లు	రూ.7,556 కోట్లు
ఎంఎస్‌ఎంఈ	రూ.1401.91 కోట్లు	రూ.922.85 కోట్లు	రూ.932 కోట్లు
విద్య	రూ.49.24 కోట్లు	రూ.15.3 కోట్లు	రూ.28 కోట్లు
హౌసింగ్	రూ.302.31 కోట్లు	రూ.307.73 కోట్లు	రూ.1,000 కోట్లు
రినవబుల్ ఎనర్జీ	రూ.11.89 కోట్లు	రూ.0.3 కోట్లు	రూ.22 కోట్లు
సోషల్ ఇన్‌ఫ్రా	రూ.13.79 కోట్లు	రూ.0.15 కోట్లు	రూ.4 కోట్లు
ప్రాధాన్యత రంగాలు	రూ.158.32 కోట్లు	రూ.348.28 కోట్లు	రూ.129 కోట్లు
వివిధ వాణిజ్యాలకు	రూ.1,202.24 కోట్లు	రూ.2,037.44	రూ.1,137.35

వివిధ పథకాల్లో చేకూరిన లబ్ధి		
పథకం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన రుణం (రూ.కోట్లలో)
పశుసంవర్ధక శాఖ	14,473	85.12
ఫిషరీస్	149	1.1
జేఎల్‌జీ	365	5.71
యాంత్రీకరణ	1,936	36.58
డెయిరీ	37,052	396.31
పౌల్ట్రీ	235	3.76
పీఎంఎఫ్‌ఎంఈ	20	0.47
ఎస్‌హెచ్‌జీ	34,834	1,682.46
పీఎంఎంవై	47,453	529.29

లక్ష్యానికి మించి రుణాల మంజూరు

ఏటా లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేస్తున్నాం. ఇందులో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నాం. అలాగే పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, యువతకు, నిరుద్యోగులకూ అండగా నిలుస్తాం.

– రమణకుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్

కుటుంబీకులకు వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్: తప్పిపోయిన వృద్ధురాలిని ఎట్టకేలకు కుటుంబసభ్యుల వద్దకు రైల్వే పోలీసులు చేర్చారు. వివరాలు... తమిళనాడులోని మధురై జిల్లా మలంపట్టి గ్రామానికి చెందిన 65 ఏళ్ల వయసున్న అలగ్ (మతి స్థిమితం లేదు) .... గత సోమవారం బెంగళూరులోని కేఆర్‌పురం రైల్వే స్టేషన్‌లో తప్పిపోయింది. ఆమె ఆచూకీ కోసం బంధువులు గాలిస్తూ హిందూపురంలోని మేళాపురంలో నివాసముంటున్న బంధువుల ఇంటికి చేరుకుని ఆరా తీశారు. అక్కడ కూడా ఆమె లేకపోవడంతో హిందూపురం రైల్వే పోలీసులకు వృద్ధురాలి ఫొటో అందజేసి, తప్పిపోయిన సమాచారం తెలిపారు. ఆచూకీ తెలిస్తే తమకు అప్పగించాలని కోరారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం హిందూపురం రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద అపస్మారకంగా పడి ఉన్న వృద్ధురాలిని ఫొటో ఆధారంగా ఆమెను తప్పిపోయిన అలగ్‌గా గుర్తించిన రైల్వే పోలీసులు, వెంటనే ఆమెను స్టేషన్‌కు తరలించి ఉపశమన చర్యలతో కోలుకునేలా చేశారు. విషయం తెలుసుకున్న హిందూపురంలోని బంధువులు స్టేషన్‌కు చేరుకుని ఆమెను గుర్తించి, తమ వెంట పిలుచుకెళ్లారు.

హమాలీ దుర్మరణం



ఆంజనేయులు (ఫైల్)

ముదిగుబ్బ: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ హమాలీ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ముదిగుబ్బలోని పాతూరుకు చెందిన ఆంజనేయులు (40)కు భార్య అంజలి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. హమాలీ పనులతో జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న తన మామ శ్రీరాములును గురువారం పులివెందులకు ఆంజనేయులు పిలుచుకెళ్లి చికిత్స చేయించి, ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ముదిగుబ్బ సమీపంలోని రెండు జీమాన్ల వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరూ కిందపడ్డారు. ఘటనలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీరాములను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

'చంద్రయాన్–3' ఓ అద్భుతం

- మిషన్ సిమ్యులేషన్ పూర్తి బాధ్యత మా బృందానిదే
- జేఎన్‌టీయూ(ఏ) పూర్వ విద్యార్థి డాక్టర్ సాయిచందన



సాయి చందనను అభినందిస్తున్న జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, తదితరులు

అనంతపురం: 'చంద్రయాన్–3 ప్రయోగంతో మనందరమూ ఓ అద్భుతాన్ని చూశాం. యావత్ ప్రపంచం గర్వించేలా చంద్రయాన్–3 విజయం సాధించింది. ఇది నవభారత విజయం. ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కావడం ఎంతో గర్వంగా ఉంది' అని జేఎన్‌టీయూ (ఏ) ఈసీఈ విభాగం పూర్వ విద్యార్థి (చంద్రయాన్–3 ప్రాజెక్ట్‌లోని ఓ శాస్త్రవేత్త) డాక్టర్ ఎ. సాయి చందన అన్నారు. ప్రస్తుతం బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో సైంటిస్ట్ 'సీ'గా పనిచేస్తున్న ఆమెను జేఎన్‌టీయూ(ఏ)లో గురువారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణకాంతి, డాక్టర్ జి.మమత, డాక్టర్ డి.విష్ణువర్ధన్, ఈసీఈ విభాగాధిపతి ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, సీనియర్ ప్రొఫెసర్లు పి.రమణారెడ్డి, వి.సుమలత, అరుణ, మస్తానీ, లలిత కుమారి, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం చంద్రయాన్–3 మిషన్‌లో ఇంజినీర్ల పాత్రను ఆమె వివరించారు.

కీలక పాత్ర మాదే..

భూమి నుంచి చంద్రుని పైకి ఉపగ్రహం వెళ్లే మధ్యలో జరిగే నావిగేషన్ ప్రక్రియ మొదలు ల్యాండింగ్ అయ్యే వరకూ తమ బృందంలోని 30 మంది బాధ్యత వహించారన్నారు. ముందుగా తాము పరిశీలించిన తర్వాతనే ల్యాండర్‌కు ఎలాంటి సందేశమైనా పంపాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో ఈ ప్రాజెక్ట్ చేపట్టినప్పుడు విజయవంతం చేసేందుకు దాదాపు వెయ్యి పర్యాయాలు సిమ్యులేషన్ చేశామన్నారు. చంద్రయాన్–3 విజయంలో కీలక పాత్ర పోషించినందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

నీటి జాడలున్నాయనే..

చంద్రుడి దక్షిణ ధ్రువంపై నీటి జాడలు ఉన్నాయని భావించడం వల్లనే రోవర్‌ను అక్కడ దింపినట్లు పేర్కొన్నారు. రాళ్లు, శిలలు తక్కువగా ఉండడంతో ల్యాండర్ సురక్షితంగా దిగేందుకు మార్గం సుగమమైందన్నారు. ఆ ప్రాంతంలో మంచు స్ఫటికాల రూపంలో నీటి నిల్వలు ఉన్నాయని ఇస్రో గుర్తించిందన్నారు. అందులోనూ దక్షిణ ధ్రువంపై గురుత్వాకర్షణ శక్తి చాలా తక్కువగా ఉంటుందన్నారు. అక్కడ వెలుతురు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీల్లో ఉంటాయన్నారు. ఈ కారణాల రీత్యా అక్కడ నీరు ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఇస్రో అంచనా మేరకు పది కోట్ల టన్నుల మేర నీరు ఉండొచ్చునన్నారు. నీరుంటే అక్కడ మానవ మనుగడ కూడా సాధ్యమవుతుందన్నారు. భవిష్యత్తులో చంద్రుడిపై పరిశోధనలకు చంద్రయాన్–3 ప్రయోగం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

నానో శాటిలైట్లదే భవిష్యత్తు

చంద్రయాన్–3 విజయవంతం చేయడంలో భారత శాస్త్రవేత్తల కృషి ప్రశంసనీయమని డాక్టర్ సాయిచందన కొనియాడారు. ఈ విజయం ద్వారా అంతరిక్ష పరిశోధనలకు 50 దేశాలు ఇస్రోతో ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. భవిష్యత్తు నానో శాటిలైట్‌లదే అవుతుందన్నారు. నానో శాటిలైట్ విప్లవానికి ఇస్రో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

దంపతులపై దాడి... 50 గొర్రెల అపహరణ



దుండగుల దాడిలో గాయపడిన ఫక్కీరప్ప, గోవిందమ్మ

నల్లచెరువు: మండలంలోని నీలవాండ్లపల్లిలో గొర్రెల మంద వద్ద కాపలా ఉంటున్న దంపతులపై దుండగులు దాడి చేసి 50 జీవాలను అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... నీలవాండ్లపల్లికి చెందిన ఫక్కీరప్ప, గోవిందమ్మ దంపతులు దాదాపు 150 గొర్రెలను ఏర్పాటు చేసుకుని, వాటి పోషణతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద గొర్రెలను విడిది చేస్తూ, అక్కడే నిద్రించేవారు. బుధవారం రాత్రి గొర్రెల మంద కాపలాగా ఉంటూ అర్ధరాత్రి దాటిన తర్వాత దంపతులు నిద్రలోకి జారుకున్నారు. ఆ సమయంలో ఓ ఆటో, బొలెరోలో వచ్చిన దాదాపు పది మంది దుండగులు దంపతులపై కర్రలతో దాడి చేసి, గాయపరిచారు. గట్టిగా అరవకుండా నోట్లో దుస్తులు కుక్కి కాళ్లు, చేతులు కట్టేశారు. అనంతరం 50 గొర్రెలను బొలెరో వాహనంలో తరలించుకెళ్లారు. గురువారం వేకువజామున అటుగా వెళ్లిన స్థానికులు దంపతుల దుస్థితిని గమనించి కట్లు విప్పి, ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాంభూపాల్ అక్కడకు చేరుకుని వివరాలు ఆరా తీశారు. అపహరించుకెళ్లిన గొర్రెల విలువ రూ.5 లక్షలని బాధిత దంపతులు వాపోయారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో మహిళకు జైలు

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: యువకుడిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో మహిళకు జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. గోరంట్ల సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన ప్రమీలమ్మ, వడ్డే శంకర్ దంపతులు. అదే గ్రామానికి చెందిన చాకలి ప్రసాద్ అక్కతో శంకర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లుగా అనుమానం పెంచుకున్న ప్రమీలమ్మ తరచూ ప్రసాద్‌తో గొడవ పడుతుండేది. గ్రామస్తుల ముందే నానా దుర్భాషలాడుతూ పరువు తీయడంతో మనస్తాపం చెందిన ప్రసాద్ 2016లో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు... ప్రసాద్ ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన ప్రమీలమ్మపై కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో న్యాయస్థానంలో హాజరు పరిచారు. అప్పటి నుంచి కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం అనంతపురం జిల్లా అదనపు జడ్జి శోభారాణి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున న్యాయవాది సృజన వాదించారు.

'ఆదరణ' కేసులో మరో ముగ్గురి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ జి. ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్రైం: ఆదరణ బాధితుల సంఖ్య పెరుగుతోందని నగర డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదరణ కేసులో ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, తాజాగా నాగేంద్ర, ప్రదీప్, రాయవరం మహేంద్రను అరెస్ట్ చేశామన్నారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపుతో ఆదరణ చిట్స్ బాధితులు చాలా మంది వచ్చారన్నారు. తాజాగా 30 మంది ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటి దాకా రూ.20 కోట్లు ఆదరణ యాజమాన్యంతో పాటు డైరెక్టర్లు దుర్వినియోగం చేసినట్లు రుజువైందన్నారు. వారి స్వప్రయోజనాల కోసం ఈ డబ్బును మళ్లించుకున్నట్లు పేర్కొన్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి...

ఆదరణలో చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడులు పెడితే అధిక రేటుతో వడ్డీలిస్తామని చెప్పి నల్లపాటి రామకృష్ణ, శైలజ దంపతులు ప్రజలను నమ్మించారని డీఎస్పీ తెలిపారు. దీంతో చాలా మంది ఆర్డీలు, ఎఫ్‌డీలు, ఎస్‌బీలు పెట్టారన్నారు. అలా సుమారు రూ. 27 కోట్లకు పైగా డబ్బును పోగేసుకున్న నిర్వాహకులు ఆ డబ్బును వారి స్వప్రయోజనాలకు వాడేసుకున్నట్లు తెలిపారు. చిట్స్ గడువు ముగిసినా డబ్బు ఇవ్వకుండా ఖాతాదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకున్నారని చెప్పారు. ఖాతాదారుల డబ్బుతో 130 ఎకరాల పొలాలు, అపార్ట్‌మెంట్లు, పాడి పశువులు, కళాశాలలు నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. ఖాతాదారులు నిలదీస్తే తమ వద్ద డబ్బు లేదని ఇచ్చినప్పుడు తీసుకోవాలని చెప్పడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారన్నారు. బాధితురాలు ఉమాదేవితో పాటు ఇప్పటి దాకా 35 మంది ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులుంటే అనంతపురం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీతో పాటు టూటౌన్ సీఐ శివరాముడు, ఎస్‌ఐ నాగేంద్ర ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారం

- వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి



విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న రమణారెడ్డి

బత్తలపల్లి: సమాజానికి మంచి ఆహారాన్ని అందించాలంటే ప్రకృతి వ్యవసాయంతోనే వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం కింద ప్రకృతి వ్యవసాయం చేపట్టిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విత్తన కిట్ల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా నిలుస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలను కొనియాడారు. ప్రకృతి వ్యవసాయంలో ఒకే రకం పంట కాకుండా మిశ్రమ పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం ఉంటుందన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని సూచించారు. ఘన, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ విధానాన్ని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, ఈఓ శంకరయ్య, ఏఓ ఓబిరెడ్డి వివరించారు. అనంతరం 60 మంది రైతులకు కిట్లను పంపిణీ చేశారు. ఒక్కొక్క కిట్ దాదాపు రూ.2,800 విలువ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైస్ ఎంపీపీ సాకే పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి నాగభూషణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పోట్లమర్రిలోని ఆర్‌బీకేను రమణారెడ్డి పరిశీలించారు.

వైభవంగా గణనాథుడి నిమజ్జనం

ప్రశాంతి నిలయం: వినాయక చవితిని పురస్కరించుకుని సత్యసాయి సంస్థల్లో నెలకొల్పిన గణనాథులను గురువారం వైభవంగా నిమజ్జనం చేశారు. సత్యసాయి విద్య, వైద్య సంస్థలతో పాటు సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయంలో వినాయకుడి ప్రతిమలను కొలువుదీర్చిన విషయం తెలిసిందే. తొలుత వినాయకుడి ప్రతిమలను ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామందిరానికి తరలించారు. ప్రత్యేక పూజల అనంతరం విద్యార్థుల సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు యథావిధిగా సాగాయి. అనంతరం వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఎనుములపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.









సత్యసాయి సంస్థల్లో ఏర్పాటు చేసిన విభిన్న రూపాల గణనాథులు, సాయికుల్వంత్ సభా మందిరంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన